క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న అసోం అడిషనల్ చీఫ్ సెక్రటరీ



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న కోట రవి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం అసోం అడిషనల్ చీఫ్ సెక్రటరీ కోట రవి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

సబ్బవరం: మండల కేంద్రం గోపాలనగర్‌లోని శ్రీకృష్ణ మందిరం వద్ద గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు, ఉచిత ప్రసాద వితరణ, సాయంత్రం ఉట్లు సంబరం,రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కృష్ణాలయం ప్రారంభం నేడు



ప్రారంభానికి ముస్తాబైన శ్రీకృష్ణాలయం

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు గొల్లపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణాలయంలో గురువారం ఉదయం 11.20 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా రామగిరి తప్పెడు గుళ్లు, దుర్గాదేవి కోలాటం, గరిడీలు, శ్రీకృష్ణ కోలాటం బృందంతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు శ్రీకృష్ణుడిని దర్శించుకోవాలని ఉత్సవ కమిటీ కోరింది.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు పెద్దరాజు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంతర్జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం



పిల్లా వెంకట రమణమూర్తి

సీతంపేట: తానా అంతర్జాతీయ కవి సమ్మేళనానికి బీవీకే కళాశాలకు చెందిన రిటైర్డ్ సంస్కృత అధ్యాపకుడు పిల్లా వెంకట రమణమూర్తిని ప్రత్యేక ఆహ్వానితుడిగా తానా సంస్థ ఆహ్వానించింది. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న ఇంటర్‌నెట్ మాధ్యమంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ కవి సమ్మేళనంలో ఆయన పాల్గొంటారు. ప్రతిష్టాత్మక కార్యక్రమంలో స్థానం కల్పించినందుకు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేది నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్‌లకు రమణమూర్తి ధన్యవాదాలు తెలిపారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



శ్రీ కృష్ణుడిని దర్శించుకున్న రావాడ గ్రామ ప్రజలు



బాలాజీ హిల్ వ్యూలో శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



ఉట్ల సంబరంలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించిన చిన్నారులు

సింహాచలం: శ్రీకృష్ణాష్టమి వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు.భక్తిశ్రద్ధలతో స్వామిని కొలిచారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు అలరించారు. ఉట్టి సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు.

- జీవీఎంసీ 93వవార్డు లక్ష్మీనరసింహనగర్‌లోని గోపీ జనవల్లభస్వామి ఆలయంలో కృష్ణాష్టమి పూజలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 6.30గంటలకు స్వామికి క్షీరాభిషేకం, ఉదయం 8.30గంటల నుంచి సహస్రనామార్చ, విష్ణుసహస్రనామ పారాయణ నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు. సాయంత్రం 4.30గంటలకు 108 రకాల ప్రసాదాలతో స్వామికి నివేదన చేశారు. అనంతరం ఊంజల్‌సేవ, బాలకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. బాలకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు ఆలరించారు. గోపీజన వల్లభస్వామిని ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కళ్యాణి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకున్నారు. 93,98వ వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, కొలుసు ఈశ్వరరావు, నాయకులు ఎర్ర వరహానరసింహం, పీతల అప్పలరాజు, నడింపల్లి రామరాజు, పీతల విష్ణుమూర్తి, దాసరి సత్తిబాబు, సూరిశెట్టి సూరిబాబు, వినోద్ తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.
- జీవీఎంసీ 98వవార్డు పరిధి అప్పన్నపాలెంలోని బాలాజీ హిల్‌వ్యూలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. చిన్నారులు చేసిన ఉట్లసంబరం ఆకట్టుకుంది.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

పరవాడ: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను రావాడ గ్రామ ప్రజలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బొట్టవానిపాలెం గ్రామంలో కొలువుదీరిన శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు అందుకూరి మురళీ శర్మ వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ వ్యక్తి మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. ప్రతీ ఒక్కరిలో దేశ భక్తి, దైవ భక్తి ఉండాలని అర్చకుడు మురళీ కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సారిపల్లి జోగినాయుడు, కోరుకొండ కొండయ్య, పల్లా గోవిందు, సారిపల్లి ఆనందం, సన్నిబాబు, తాతారావు, మాతృమూర్తులు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి దాలిబోయిన సంజీవరావు, వెన్నల అప్పలనాయుడు పాల్గొన్నారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న దంపతులు శ్రీకృష్ణుడిని దర్శించుకుని పూజలు జరిపారు.

రోడ్ల అభివృద్ధికి రూ.7.75 కోట్ల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న కనక మహలక్ష్మినాయుడు

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధిలో రోడ్లు అభివృద్ధికి రూ.7.75 కోట్లు జీవీఎంసీ నిధులు మంజూరు చేసినట్లు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనక మహలక్ష్మినాయుడు తెలిపారు. అజనగిరిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొత్తూరు నుంచి నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకూ నాలుగు ప్యాకేజీలుగా ఈ రోడ్డును విస్తరించనున్నట్లు తెలిపారు. రూ.7.75 కోట్ల నిధులతో 3.5 కిలో మీటర్ల రోడ్డును 24 అడుగుల వెడల్పుతో విస్తరించనున్నట్టు చెప్పారు. దశాబ్దాలగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డుకు 15 రోజుల్లోపే ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌తో పాటు మేయర్ పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. గతంలో విమర్శలు చేసిన కొంతమందికి ఇది చెంప పెట్టుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, సచివాలయ కన్వీనర్లు నారపిన్ని అప్పలరాజు,సర్వసిద్ధి బోరయ్య,చట్టి తాతారావు,ఇందల శ్రీధర్,బలిరెడ్డి రామునాయుడు,కె. ఎర్నిబాబు,ఎస్. శ్రీనివాసరావు,మాటూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాదయాత్ర

సింహాచలం: పంచగ్రామాల భూసమస్య పరిష్కరించాలని గురువారం సింహాచలం నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంక్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు తెలిపారు. సింహాచలంలోని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద సాయంత్రం 4.30గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.బాధితులంతా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వెండి కిరీటాలు, ఆభరణాల బహూకరణ



అర్చకుడికి వెండి కిరీటాలు, ఆభరణాలు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



స్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు, దాతలు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పాపయ్యరాజుపాలెం ఆర్టీసీ లేఅవుట్‌లోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దాతలు సమకూర్చిన వెండి కిరీటాలు, ఆభరణాలను బుధవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతులమీదుగా అందజేశారు. పాపయ్యరాజుపాలేనికి చెందిన దాతలు జి.సంగమేశ్వరరావు, రామారావు, దూర్వాసులు, రవి ప్రసాద్, కృష్ణారావు, శేఖర్, నాగమణి, మోహనరావు, రామప్రసాద్ రూ. లక్షతో స్వామికి వెండి కిరీటాలు, ఆభరణాలు చేయించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు వాటిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, కె.సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు కేవీఆర్.లక్ష్మి, భీమారావు, రామసూరి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు అడ్డుకున్న వారిపై చర్యలకు డిమాండ్



వెదుళ్లనరవలో నిలిచిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని చూపిస్తున్న మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు

సబ్బవరం: జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్లనరవలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న వ్యక్తిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం రోడ్డు పనులు అడ్డుకున్న ప్రాంతాన్ని విలేకరులకు చూపించారు. జీవీఎంసీ నిధులతో మంగళవారం వెదుళ్లనరవ గ్రామంలో సీసీ రోడ్డు వేస్తున్న సిబ్బందిని అడ్డుకొని తనకు పట్టా ఇచ్చారని గ్రామానికి చెందిన చొప్పా నూకరాజు అనే వ్యక్తి దౌర్జన్యంగా అభివృద్ధి పనులు అడ్డుకోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపేశారన్నారు. కాగా ప్రభుత్వం నూకరాజు సోదరుడితో పాటు మరో ముగ్గురికి సర్వే నెంబరు 127లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. నూకరాజు అక్కడ పక్కా ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నప్పటికీ యధావిధిగా ఇక్కడ మరలా అభివృద్ధి పనులు అడ్డుకుంటున్నాడన్నారు. అధికారుల ఈ విషయంపై స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు కన్వీనర్ గంగ్రెడ్డి కనకమహాలక్ష్మి నాయుడు,మాజీ సర్పంచ్ సారిపల్లి పైడిరాజు, స్థానిక నేతలు నారపిన్ని అప్పలరాజు,బొరయ్య, తాతారావు పాల్గొన్నారు.

రేపు ఉచిత సామూహిక శ్రావణలక్ష్మీ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్ : శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి దేవస్థానంలో నెల రోజుల పాటు శ్రావణలక్ష్మి పూజలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 8న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు కనకమహాలక్ష్మీ దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు పూరించి గురువారంలోగా అందజేయాలి.

నేడు సహస్ర తులసీదళార్చన.. : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091 లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

21వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు.. : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు బుధవారం 21వ రోజుకి చేరాయి. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891 -2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- భర్నికం గ్రామ సచివాలయ భవనం ప్రారంభం



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. భర్నికం గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి ఆధారంగా రెండు పేజీల మేనిఫెస్టో రూపొందించారన్నారు. అందులో పొందుపర్చిన 95 శాతం హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసి చరిత్ర సృష్టించారని చెప్పారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి పాలనలో నూతన శకానికి నాంది పలికారన్నారు. ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలన దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలకు దేశ వ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు.తొలుత సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో వి.సుందర్రావు, తహసీల్దారు పి.కనకారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బి.అప్పలరాజు, బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు సహకరిస్తాం



మేయర్ హరి వెంకటకుమారిని సత్కరిస్తున్న ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అల్లిపురం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కొన్ని స్కూల్స్ మూతపడుతున్న సమయంలో అసోసియేషన్ చేసిన సేవలు తాను తెలుసుకున్నానని తెలిపారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, మిడ్ డే మీల్స్ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ మూర్తి, రాజీవ్ విద్యా మిషన్ ప్రతినిధి బి.శ్రీనివాస్ పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, కోశాధికారి మూర్తి, రాష్ట్ర నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజా భాగస్వామ్యంతోనే ‘ఉక్కు’ పరిరక్షణ



937వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే కార్మికులు తీవ్రస్థాయిలో నష్టపోతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలని, ప్రజా భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 937వ రోజు బుధవారం సంస్థలోని ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, ప్లాంట్‌కు భూములు ఇచ్చిన నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దేశ ప్రజలందరూ ఐక్యంగా అడ్డుకోవాలని కోరారు. కార్మికుల హక్కులు కాపాడాలన్నా, భూ నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలో కొనసాగే విధంగా ప్రజలతో కలిసి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

బ్లాస్ట్ ఫర్నేస్-3లో ఉత్పత్తి ప్రారంభించాలి



స్టీల్‌ప్లాంట్ నూతన సీజీఎం స్వామిని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: బ్లాస్ట్‌ఫర్నేస్-3లో ఉత్పత్తి సత్వరం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.వి. స్వామిని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. సీజీఎంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు ఆయన్ను బుధవారం కలిసి అభినందించారు. వారు మాట్లాడుతూ నూతన సీజీఎం నేతృత్వంలో ప్లాంట్ పూర్తి స్థాయిలో నడిచేలా సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. సీజీఎం స్వామి మాట్లాడుతూ ఈ ఏడాది కచ్చితంగా నెట్ ప్రాఫిట్ వస్తుందన్నారు. ప్లాంట్‌లో చిన్న చిన్న సమస్యలు ఉన్నా ప్లాంట్‌ను ముందుకు తీసుకు వెళ్లడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, బీఎంకె నాయక్, రమణమూర్తి, ఎస్.ఎ. నాయుడు, నారాయణరావు, మింది దేముడు తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా గాత్ర కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న శారదా సుబ్రహ్మణ్యం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటకోత్సవాల 5వ రోజు శారదా సుబ్రహ్మణ్యం గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, శారదా సుబ్రహ్మణ్యం గుమ్ములూరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేశారు. వయొలిన్‌పై మావుదూరి శర్మ, మృదంగంపై జయ భాస్కర్, ఘటంపై ఎం.సూర్యప్రసాద్ సహకారం అందించారు.

ఫణీంద్రను తల్లికి అప్పగించిన రెడ్‌క్రాస్ సొసైటీ



ఫణీంద్రను తల్లి మల్లేశ్వరికి అప్పగిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ : పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన ఫణీంద్ర (22) అనే యువకుడిని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు త్రీటౌన్ పోలీసుల సమక్షంలో అతని తల్లి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. బీటెక్ చదువుతున్న ఫణీంద్రను తల్లి కళాశాలకు సరిగ్గా వెళ్లడం లేదని మందలించింది. దీంతో కోపానికి గురైన అతను ఇంట్లో నుంచి పారిపోయి వచ్చి విశాఖ చేరుకున్నాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి నైట్ పెట్రోలింగ్ చేస్తున్న త్రీటౌన్ ఎస్ఐ రాముతో పాటు సిబ్బందికి బీచ్‌రోడ్డులో కనిపించాడు. వివరాలు అడగ్గా సరైన సమాధానం ఇవ్వలేదు. ఎదైనా అఘాయిత్యం చేసుకుంటాడనే అనుమానంతో పోలీసులు ఫణీంద్రను త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి అనంతరం పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు అప్పగించారు. అతన్నుంచి వివరాలు సేకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అతని తల్లి మల్లేశ్వరితో పాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో బుధవారం అతన్ని తల్లి మల్లేశ్వరికి అప్పగించారు.